పోటీకి అవకాశం కల్పించండి

ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సునీతలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీరయ్యయాదవ్

సంగారెడ్డి, ఫిబ్రవరి 8: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిలకు బీరయ్యయాదవ్ వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నివాసాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీసీ వర్గానికి చెందిన తనకు బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం ఇప్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఉర్సును విజయవంతం చేయాలి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 8: న్యాల్‌కల్ శివారులోని పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా ఉర్సును విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యూనూస్‌ఖాన్ కోరారు. గురువారం దర్గా ఆవరణలో ఉర్సు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉర్సు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 23వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. భక్తులు, వ్యాపారులు ఇబ్బందులు పడకుండా తాగునీరు, విద్యుత్, పార్కింగ్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకరయ్యస్వామి, బస్వరాజ్, ఇసాంపటేల్, మక్సుద్, సత్యనారాయణ, సతీశ్‌కులకర్ణి, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు నర్సింహులు, ప్రధానకార్యదర్శి అబ్దుల్, కమిటీ సభ్యులు జగన్నాథ్, శివకుమార్‌స్వామి, బస్వరాజ్, ప్రవీణ్, ప్రభు, మక్సుద్, కుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కోహీర్, ఫిబ్రవరి 8: గ్రామాల్లో నెలల తరబడి ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ మల్లన్న, భీమ్‌సింగ్ చౌహాన్ ట్రాన్స్‌కో అధికారులను కోరారు. గురువారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మల్లన్న మాట్లాడుతూ చింతల్‌ఘాట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సిద్దాపూర్ తండాలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను సరిచేయాలని కోరారు. 200యూనిట్ల ఫ్రీ కరెంటు కోసం ఎప్పటి నుంచి వివరాలను సేకరిస్తారో తెలపాలన్నారు. చాటింపు చేసిన తర్వాతనే విద్యుత్ సిబ్బంది గ్రామాలకు వచ్చి మీటర్ల వివరాలు, ఆధార్, ఫోన్ నంబర్, తదితర వివరాలను తీసుకోవాలని కోరారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందించాలన్నారు. ఎస్సీ హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు నిధులు ఉన్నాయని వార్డెన్ వెంకటేశం తెలిపారు. సంబంధిత అధికారులు సర్వే చేసి హద్దులు చూపిస్తే పనులు ప్రారంభిస్తామని తహసీల్దార్ శాంతకుమారిని ఆయన కోరారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ సూర్యారావు, జడ్పీటీసీ రాందాస్, ఎంపీడీవో సుజాతానాయక్, ఎంపీవో రఘు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ

జిన్నారం, ఫిబ్రవరి 8: మాదారంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన నియోజిన్ కెమికల్స్ పరిశ్రమ ముందుకొచ్చింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని పరిశ్రమ ప్రతినిధులు శ్యాంసుందర్, నరేశ్, చందుమోహన్‌తో కలిసి మాజీసర్పంచ్ సురేందర్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. పది కుట్టు మిషన్లను పరిశ్రమ అందించగా గ్రామానికి చెందిన సుమారు 25మంది మహిళలు శిక్షణ తీసుకునేందుకు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ ఉచితంగా మిషన్లు అందజేస్తామని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీసర్పంచ్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ స్పెషలాఫీసర్ పీఆర్ఏఈ మల్లేశం, గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 8: గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎల్లయ్య పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుద్య వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని మిర్జాపూర్(బి), గంగ్వార్, హుస్సెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన పారిశుద్య పనులతోపాటు హరితహారంలో నర్సరీలో మొక్కల పెంపకం, పల్లె ప్రకృతి వనం తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పరిసరాలతోపాటు మురుగుకాల్వల్లో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలన్నారు. నర్సరీలో మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. హరితహారంలో భాగంగా పల్లె ప్రకృతి వనం, అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి రాఘవరావు, మండల అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి, గ్రామాల ప్రత్యేకాధికారులు, సిబ్బంది ఉన్నారు.

పండరీపూర్‌కు భక్తుల పాదయాత్ర

పండరీపూర్‌కు పాదయాత్రతో తరలివెళ్తున్న భక్తులు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 8: మండలంలోని హద్నూర్ గ్రామం నుంచి మహారాష్ట్రలోని పండరీపూర్ వితలేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. గురువారం స్థానిక హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా చంద్రభాగా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం వితలేశ్వరుడిని దర్శించుకుంటామని భక్తులు పేర్కొన్నారు.

నాగల్‌గిద్ద, కరస్‌గుత్తి గ్రామాల నుంచి..

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 8: నాగల్‌గిద్ద, కరస్‌గుత్తి గ్రామాల నుంచి భక్తులు మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రమైన పండరీపూర్‌కు గురువారం కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామ శివాలయం, పాండురం గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, హన్మంత్‌రావు మహారాజ్ ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు పాదయాత్రగా బయలుదేరారు.

బహిరంగ ప్రకటన

తేది: 09.02.2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లయింట్ పురాణం రాజేష్ (తండ్రి పురాణం అలియాస్ శంబుని ప్రకాశరావు) గారికి పెద్దల నుండి సంక్రమించిన ఉమ్మడి ఆస్తిని, తన వాటాను విభజన చేయుటకు సంగారెడ్డి మొబైల్ ప్రత్యేక న్యాయస్థానంలో వేసిన దావా నంబర్ 591/2021 మరియు దావా భూమిని అన్యాక్రాంతము చేయకుండుటకు/ఆపుటకు injunction order IA No. 171/2021 పరిశీలనలో వుంది. మరియు ఇంకను IA No. 1065/2023 మరియు IA No. 1066/2023 మరియు IA No. 1067/2023 పరిశీలనలో వున్నాయి. ఇట్టి విషయమును పరోక్షంగా పై దావా ప్రతివాదులు అన్యాక్రాంతము చేసే ప్రయత్నంలో వున్నారు. కావున ఎవరైనా ఇట్టి ప్రకటనను విస్మరించి క్రయ విక్రయ లావాదేవీలు జరుపరాదు, జరిపినచో చట్ట పరంగా తీసుకోబోయే చర్యలకు బాధ్యులు కాగలరు మరియు ఖరీదు బాపతులో చెల్లించిన డబ్బులకు వారే స్వయముగా బాధ్యులు కాగలరు. షెడ్యూల్ ఆస్తులు:

I. 1) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు తహసీల్, పోచారం గ్రామ పరిధి సర్వే నంబర్ 112/లో విస్తీర్ణం 1 ఎకర 24 గుంటలు. 2) మెదక్ జిల్లా వెల్దుర్తి తహసీల్ బండపోసాన్ పల్లి గ్రామ పరిధి సర్వే నంబర్ 275ఆ లో విస్తీర్ణం 0.3350 గుంటలు మరియు సర్వే నంబర్ 363/అ1లో విస్తీర్ణం 0.3200 గుంటలు.

II. 1) సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నగరము మరియు మండలములో రామాలయం వీధి నర్రబస్తీలో గల నివాసపు ఇంటి నం.6-193 విస్తీర్ణం 450 చ.గజాలు. 2) సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నగరము మరియు మండలములో రామాలయం వీధి నర్రబస్తీలో గల ఇంటి స్థలం యొక్క No. 6-194 విస్తీర్ణం 242 చ.గజాలు.

సం/- బి. వెంకట్ రెడ్డి, B.A, LL.B అడ్వకేట్
ఇం.నం. 8-15 తహసీల్దారు ఆఫీస్ ఎదురుగా,
ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా-501506,TS
ఫోన్ : 9441118455,8498849865

పరిసరాలను కలుషితం చేయొద్దు

- హెచ్ఎండీఏ డంపింగ్ యార్డుతో నాలుగు గ్రామాల ప్రజలు, రైతులు, నాయకుల ఆందోళన
- గుమ్మడిదల జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో
- ఉన్నతాధికారులకు నివేదిస్తామన్న తహసీల్దార్

గుమ్మడిదల: నల్లవల్లి అటవీప్రాంతంలో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 8: హెచ్ఎండీఏ పరిధిలోని చెత్తను తీసుకొచ్చి అటవీ ప్రాంతంలో డంపింగ్ చేస్తూ, పరిసరాలను కలుషితం చేయొద్దని నాలుగు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపై ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి అటవీని నాశనం చేస్తున్నారని నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల ప్రజలు గురువారం మెదక్ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. పెద్దసంఖ్యలో రైతులు, యువకులు, మహిళలు ధర్నా చేయడంతో గంటకు పైగా వాహనాలు స్తంభించాయి. గతంలో గుండవరం వేణుగోపాల్ ఆధ్వర్యంలో గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని విన్నవిస్తే హెచ్ఎండీఏ అధికారులు వెనుకకు తగ్గారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన అనంతరం డంపింగ్ యార్డు ఏర్పాటుకు పనులు ప్రారంభించడంతో నాలుగు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయమే జీవితంగా బతుకుతున్న మాకు డంపింగ్ యార్డు యమపాశంగా మారి, వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లవల్లి అటవీ ప్రాంతంతోపాటు నాలుగు గ్రామాల ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి డంపింగ్‌యార్డు ఏర్పాటును వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ గంగాభవానికి గ్రామాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌తోపాటు సీఐ సుధీర్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ప్రజల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు. ఆందోళనలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు దోమడుగు శంకర్, ఆంజనేయులు, హన్మంత్‌రెడ్డి, రాజశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, నాయకుడుమధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

- పెట్రోల్ పోసి నిప్పంటించి నీటిగుంతలో పడేసిన వైనం
- డబ్బుల విషయంలో గొడవే కారణం
- క్లూస్‌టీం ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగింత

హత్యకు గురైన వడ్డెసునీత (ఫైల్)

హత్నూర, ఫిబ్రవరి 8: వివాహితను కొట్టి చంపి, పెట్రోల్ పోసి నిప్పంటించి మృతదేహాన్ని నీటిగుంతలో పడేసిన ఘటన హత్నూర మండలంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఎస్ఐ సుభాష్ తెలిపిన కథనం ప్రకారం హత్నూర మండలం గోవింద రాజ్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డె సునీత(35)కు ఇరవై ఏండ్లక్రితం నాగులదేవులపల్లికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. ఆమె పదిహేనేండ్ల క్రితం భర్త నుంచి విడాకులు తీసుకొని గోవిందరాజ్‌పల్లిలో ఇల్లు కట్టుకొని నివసిస్తుంది. అప్పటి నుంచి కూలీ పనులకెళ్తూ ఇద్దరు కుమారులను పోషించుకుంటుంది. జనవరి 31న ఇంట్లోనుంచి పని కోసం వెళ్లిన సునీత ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫిబ్రవరి 5న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి ఫోన్‌నెంబర్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. దీంతో మాధుర గ్రామానికి చెందిన మాదిగ దత్తయ్య జనవరి 31న సునీతను పిలిపించుకొని మాధుర శివారులో మద్యం తాగారు. అనంతరం ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో దత్తయ్య బండరాయితో కొట్టి చంపాడు. పెట్రోల్ పోసి మృతదేహాన్ని కాల్చి నీటిగుంతలో పడేయడంతోపాటు బండరాళ్లు పెట్టినట్లు తెలిపారు. నిందితుడు ఘటనా స్థలం వద్దకెళ్లి చూపెట్టగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో క్లూస్‌టీం సభ్యులు వచ్చి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు. మృతురాలికి నిందితుడికి మధ్య వివాహేతర సంబంధమే హత్యకు దారితీసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తమ్ముడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు దత్తయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శ్మశాన వాటికను కాపాడాలి

కంది, ఫిబ్రవరి 8: కంది మండలం మక్తఅల్లూర్ గ్రామంలోని ఎస్సీలకు సంబంధించిన శ్మశాన వాటికను కాపాడాలని కోరుతూ ఎస్సీ,ఎస్టీ ఐక్య సంఘటన వేదిక ఆధ్వర్యంలో గురువారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. మాదిగలకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, ఆ భూమిని తిరిగి అప్పగించి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక సంఘటన అధ్యక్షుడు పోలీస్ రాంచందర్, గంగేరి శ్రీనివాస్, సురేశ్, నర్సింహులు, సాయిలు, బందయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ,ఎస్టీ ఐక్య సంఘటన వేదిక నాయకులు

బంజారా ఉద్యోగులకు ఓడీ సౌకర్యం కల్పించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 8: సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున బంజారా ఉద్యోగులకు ఓడీ సౌకర్యం కల్పించాలని సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏవోకు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. గురువారం జహీరాబాద్‌కు చెందిన బంజారా ఉద్యోగులు, నాయకులు సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏవో పరమేశ్వర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించి, జయంతి ఉత్సవాల్లో ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమం లో టీబీఈఎస్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీరామ్ రాథోడ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంజ్యానాయక్, జిల్లా ప్రధానకార్యదర్శి అర్జున్ చౌహాన్, నాయకులు శ్రీనివాస్‌నాయక్‌పవార్, వాసునాయక్, రఘునాథ్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సంతకాల సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక సంఘాలతో కలిసి ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బాలాజీనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో స్వేచ్ఛ ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి సమ్మెకు మద్దతుగా సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆటో యూనియన్ నాయకులు లకన్, మధు, దుర్గయ్య, విజయ్, అంబాజీ, సురేశ్, నర్సింహులు, మల్లేశం పాల్గొన్నారు.

నామమాత్రంగా..

కార్మికుల పోరాటాలతోనే ప్రభుత్వం రూ.వెయ్యి నామమాత్రంగా పెంచిందని, అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి కోరారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ కార్మికులకు పెంచిన రూ.వెయ్యి నామమాత్రమేనని, అనేక సంవత్సరాల నుంచి మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులందరికీ వర్తింపజేయాలన్నారు. అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామని, ఔట్‌సోర్సింగ్ విధానం లేకుండా రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అదే పద్ధతిని అవలంబిస్తూ కుంటితుడుపు చర్యగా రూ. వెయ్యి పెంచడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, సువర్ణ, నర్సింహులు, రాజేశ్, లక్ష్మీనారాయణ, నరసన్న, మంజుల పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కల్హేర్ : బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 8: బాచేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. ఆయనకు మంజూరైన పార్టీ సభ్యత్వ బీమా రూ.2లక్షల చెక్కును మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పార్టీ సభ్యత్వ బీమా పథకం ఏ రాజకీయ పార్టీలో లేదన్నారు. అనంతరం అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన రథన్‌సింగ్ మరణవార్త తెలుసుకున్న భూపాల్‌రెడ్డి వారి ఇంటికెళ్లి కుటుంబసభ్యులకు పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాంసింగ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు, అలీఖాన్‌పల్లి సర్పంచ్ కృష్ణారెడ్డి, అంజయ్య, కృష్ణాగౌడ్, మాణిక్ ప్రభు, మున్యానాయక్, జయరాం ఉన్నారు.

జిన్నారం సీఐగా సుధీర్‌కుమార్

జిన్నారం, ఫిబ్రవరి 8 : జిన్నారం సీఐగా సుధీర్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి రూరల్ సీఐగా పని చేసిన సుధీర్‌కుమార్ జిన్నారానికి బదిలీ కాగా, జిన్నారం సీఐగా పని చేసిన వేణుకుమార్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

జాతీయ రహదారి కోసం భూసేకరణ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

మనూరు, ఫిబ్రవరి 8: ఎన్‌హెచ్ 161బీ విస్తరణ కోసం భూసేకరణ చేస్తున్నామని నారాయణఖేడ్ ఆర్డీవో వెంకటేశం తెలిపారు. గురువారం మనూరు మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ నుంచి నారాయణఖేడ్, మనూరు మీదుగా బీదర్ వరకు జాతీయ రహదారి పనులు జరగనున్నాయన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడుతున్నామని చెప్పారు. మనూరు తహసీల్దార్ మల్లేశ్‌కుమార్, ఆర్ఐ తాజోద్దీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసేకరణపై రైతులకు అవగాహన

నిజాంపేట్ ఫిబ్రవరి 8: నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారి 161బీ విస్తరణలో భాగంగా భూమి కోల్పోయిన పట్టాదారులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని రెవెన్యూ డివిజన్ అధికారి వెంకటేశం తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని నిజాంపేట్‌లో రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసి వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్, ఆర్ఐ రాంచందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దేవతల గుట్ట స్థలాన్ని కాపాడాలి

బొల్లారం, ఫిబ్రవరి 8: మున్సిపల్ పరిధిలోని దేవతల గుట్ట హుడా స్థలాన్ని కాపాడాలంటూ బొల్లారంవాసులు గురువారం హుడా సెక్రటరీ చంద్రయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ధర్మ ప్రచార కోకన్వీనర్ సుభాష్‌చందర్ జీ, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, నాయకుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా దేవతల గుట్ట హిందువులకు సంబంధించిందన్నారు. 23, 42, 233, 254, 268, 278, 280, 284, 15 సర్వే నంబర్లలో ప్రభుత్వానికి సంబంధించిన హుడా స్థలంలోని గుట్టపై అన్యమతస్తుల ప్రార్థనామందిరాలను తొలగించి మతఘర్షణలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ హుడా స్థలాన్ని సర్వే చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుదాం

కంది, ఫిబ్రవరి 8: ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలని కంది మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రమదానం నిర్వహించారు. ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలంటూ వ్యాపారుల వద్దకెళ్లి విన్నవించారు. ఈ సందర్భంగా ప్రత్యేకారి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని, ఎవరికి వారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి,పొడి చెత్తను వెర్వేరుగా వేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. గ్రామాల్లోని వాటర్‌ట్యాంక్‌లు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలను శుభ్రంచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ గౌడ్, పలు పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరువులోపడి ఒకరి మృతి

చౌటకూర్, ఫిబ్రవరి 8: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సుల్తాన్‌పూర్‌లో గురువారం జరిగింది. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన వడ్ల మల్లేశం(46) పని కోసం సుల్తాన్‌పూర్‌కు వచ్చాడు. సాయంత్రం ఉప్పరిగూడెం గ్రామానికి వెళ్తూ పెద్ద చెరువు తూము కల్వర్టుపై నిద్రపోయారు. ప్రమాదశాత్తు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో పడి ఊపిరాడక మృత్యువాత పడ్డారు. దీనిని గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మల్లేశం మృతి చెందారు. పోలీసులకు సమాచారమందించగా మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీల పట్టివేత

న్యాల్‌కల్, ఫిబ్రవరి 8 : అనుమతి లేకుండా అక్రమంగా ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్టు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. మండలంలోని మెటల్‌కుంట చౌరస్తాలో గురువారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా సంగారెడ్డి వైపు నుంచి కర్ణాటకకు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఓవర్‌లోడ్‌తో ఇసుకను తరలిస్తున్న టీఎస్-12యుఏ 9563, టీఎస్-12 యూడీ 4665 లారీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామానాయుడు పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 8: మండలంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తానని జడ్పీటీసీ స్వప్నకుమారి పేర్కొన్నారు. గురువారం న్యాల్‌కల్‌లోని ఎస్సీకాలనీలో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామన్నారు. విడతల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ శివశంకరయ్యస్వామి, మండల, గ్రామ నాయకులు భాస్కర్, సత్యనారాయణ, బస్వరాజ్, ఇసాంపటేల్, మక్సుద్, శివరాజ్, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలం, నెహ్రూ, నర్సింహులు, ఏసయ్య, బాలప్ప పాల్గొన్నారు.

గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్

సిర్గాపూర్, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీల్లో గురువారం ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ స్పెషలాఫీసర్లు, యువకులు, మహిళలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శ్రమదానంలో పాల్గొని పరిసరాలను శుభ్రపర్చారు. గ్రామాల స్వచ్ఛత కోసం నడుంబిగించారు. తహసీల్దార్ ఉమాశంకర్ వాసర్‌గ్రామంలో, ఎంపీడీవో సుజాత కడ్పల్‌లో శ్రమదానం చేసి ప్రజలకు శానిటేషన్‌పై అవగాహన కల్పించారు పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

నిధులుమంజూరు చేయాలి

జోనల్ కమిషనర్ స్నేహ శబరీశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 8: ఆర్సీపురం డివిజన్‌లోని శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ జోనల్ కమిషనర్ స్నేహాశబరీశ్‌ను కోరారు. గురువారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లోని హిందూ శ్మశానవాటికలో ముఖద్వారం, వెయిటింగ్ హాల్, షెడ్లు, శివుడు, కాటికాపరి విగ్రహాలు, నాయీబ్రాహ్మణ, రజకుల గదులు, సీసీ రోడ్లు, బోర్‌వెల్, బర్నింగ్ ప్లాట్‌ఫామ్ తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించారని చెప్పారు.

చెరువుల కబ్జాను అడ్డుకోవాలి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: చెరువులను కబ్జాల నుంచి కాపాడాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ స్నేహాశబరీశ్‌కు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఫిర్యాదు చేశారు. 22వ సర్కిల్ పరిధి కార్పొరేటర్ల సమీక్షా సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని దోషం చెరువును కబ్జా చేయడంతోపాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని జోనల్ కమిషనర్‌కు తెలిపారు. కబ్జాల వీడియోను, ఫొటోలను జోనల్ కమిషనర్‌కు అందజేశారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈమేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు, డీఈ నళిని, పావని బృందం దోషం చెరువును పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో కడుతున్న కంపౌండ్ వాల్‌ను జేసీబీలతో కూల్చివేశారు.

గోడపత్రిక ఆవిష్కరణ

అందోల్, ఫిబ్రవరి 8: ఖమ్మంలో ఈనెల 11,12వ తేదీల్లో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్ అన్నారు. గురువారం జోగిపేట బాలుర పాఠశాలలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, సభ్యులు చంద్రశేఖర్, అహ్మద్ అలీ, మహ్మద్, ఫరీద్, మునీర్ ఉన్నారు.

వారోత్సవాల్లో.. శ్రమదానం

జిన్నారం, ఫిబ్రవరి 8 : ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం జిన్నారం, ఖాజీపల్లి గ్రామాల్లో గురువారం శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రాములు పాల్గొన్నారు. ఖాజీపల్లిలో గ్రామస్తులు, మహిళలతో కలిసి రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. జిన్నారంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులతో కలిసి తొలగించి బాగు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.